శివ పార్వతుల ఏకపీఠం.. పలివెల క్షేత్రం

- నేటి రాత్రి ఉమా కొప్పేశ్వరుల కల్యాణం
- 26న మహాశివరాత్రి, రథోత్సవం

కొత్తపేట: జిల్లాలో పురాణ ప్రసిద్ధి చెందిన శివాలయాల్లో కొత్తపేట మండలం పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి క్షేత్రం ఒకటి. అగస్త్యేశ్వర మహాముని కోరిన మేరకు శివపార్వతులు ఏకపీఠంపై కొలువు దీరడం ఈ క్షేత్రంలో ఒక విశేషం. పరమశివుని మహా భక్తుడైన పూజారి ప్రాణాలు నిలిపేందుకు శివుడు కొప్పు ధరించిన వైనం మరో విశేషం. అందుకే ఈ క్షేత్రంలో శివలింగానికి ముందు భాగంలో కొప్పు వుంటుంది. ఈ క్షేత్రంలో మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఆ మేరకు జిల్లా దేవదాయ–ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో దేవస్థానం ఈఓ సోమాల శివ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం నుంచి ఈ నెల 28 వరకూ శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. 6 రోజుల పాటు పాంచాహ్నిక ధ్వజారోహణ దీక్షతో దివ్య కల్యాణ మహో త్సవాలు వైభవంగా జరగనున్నాయి.

అగస్త్య మహర్షి ప్రతిష్ఠించిన శివలింగం

పూర్వం పల్వలపురం అనే ఈ పలివెలలో శివాలయం పురాణ ప్రసిద్ధి చెందింది. ఇక్కడ శివలింగాన్ని అగస్త్య మహర్షి ప్రతిష్ఠించినట్టు స్థల పురాణంలో పేర్కొన్నారు. అగస్త్య మహర్షి శివపార్వతుల కల్యాణం చూడాలనే కోరికతో కౌశిక నది


స్వామివారి ఊరేగింపునకు సిద్ధమైన వాహనాలు


ఏకపీఠంపై పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి


ఉమా కొప్పేశ్వరస్వామి ఆలయం

తీరాన శివలింగ ప్రతిష్ఠ చేశాడు. దక్షయజ్ఞానికి పూర్వం ఇంద్రాది దేవతలు, హిమవంతుడు అగస్త్య మహర్షి తన దివ్య దృష్టితో శివపార్వతుల కల్యాణం వీక్షించగా శివపార్వతులు మధుపర్కాలతో కనిపిస్తారు. అగస్త్య మహర్షి శివుని ప్రార్థించగా శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమనగా మీ కల్యాణ దంపతులు ఒకే పీఠంపై అనుగ్రహించమని కోరాడు. ఆ విధంగా ఇక్కడ ఏకపీఠంపై శివలింగం, పార్వతీదేవి అమ్మవారు ఉంటారు. ఈ విధంగా శివపార్వతులు కలిసి ఉన్న ఏకపీఠం ఎక్కడా, ఏ క్షేత్రం లోనూ కనిపించదు.

నేటి నుంచి కల్యాణోత్సవాలు

ఉమా కొప్పేశ్వరుల కల్యాణ మహోత్సవాలు, శివరాత్రి ఉత్సవాలు ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభమవుతాయి. అంకురార్పణ, ధ్వజారోహణ, గ్రామోత్సవం జరుగుతాయి. ఆదివారం రాత్రి 4.45 గంటలకు (తెల్లవారితే సోమవారం) స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆగమశాస్త్ర పండితులతో వైభవంగా నిర్వహిస్తారు. 24, 25 తేదీల్లో వివిధ ప్రత్యేక పూజలు, విశేషార్చనలు, కుంకుమ పూజలు జరుపుతారు. 26న మహాశి వరాత్రి సందర్భంగా తెల్లవారుజామున స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. మధ్యాహ్నం 2.45 గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుంది. 27న త్రిశూల స్నానం, 28న శ్రీపుష్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. కోలాటం, కూచిపూడి వంటి సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ మేరకు దేవస్థానం అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కొబ్బరితోటలో శివలింగానికి పూజలు

అయినవిల్లి: పోతుకుర్రు గ్రామంలో ఒక రైతు పొలంలో స్వయంభువుగా వెలిసిన అద్భుత పురాతన శివలింగం భక్తులతో పూజలు అందుకుంటోంది. అన్నపూర్ణా సమేత భీమేశ్వర స్వామిగా కీర్తిస్తున్న ఈ శివలింగానికి ఘనమైన చరిత్ర ఉంది. శివలింగం పక్కనే పెద్ద పాము పుట్ట ఉంది. అందులో నుంచి పెద్ద పాము నిత్యం ఉదయం, సాయంత్రం వచ్చి ఈ శివలింగాన్ని చుట్టుకుని పడుకుంటుంది. ఆ సమయంలో భక్తులు ఎవరూ శివలింగం దగ్గరకి వెళ్లరు. శివలింగానికి దగ్గరలోనే పెద్ద జమ్మి చెట్టు ఉంది. ఆ జమ్మి చెట్టు స్థానంలో ఇటీవల మరో జమ్మి చెట్టు పెరుగుతోంది. గ్రామం చుట్టుపక్కల పూర్వీకులు ఈ శివలింగాన్ని చూసి గుడి కట్టేందుకు ప్రయత్నించారట. అయితే ఈ శివలింగానికి గుడి కడితే ద్రాక్షారామలోని భీమేశ్వరస్వామి వారి గుడి శిఖరం కనపడేటంత ఎత్తులో కట్టాలని పండితులు చెప్పారట. దీంతో అంత వ్యయం చేయలేక తమకు తోచిన రీతిన సహాయం అందిస్తున్నారు. అమలాపురం ముమ్మిడివరం రోడ్డులో మహిపాల చెరువు సెంటర్ నుంచి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోతుకుర్రులో ఒక రైతు పొలంలో శివలింగం వెలసింది. ఈ


పోతుకుర్రులో శతాబ్దాలుగా పూజలందుకుంటున్న అద్భుత శివలింగం


శివలింగం పక్కనే ఉన్న పాముల పుట్ట

అద్భుత శివలింగాన్ని దర్శించి ఏటా భక్తులు మహా రుద్రాభిషేకాలు, పూజలు నిర్వహిస్తూ అన్నదానం కూడా చేస్తున్నారు.

చెత్త సేకరణపై దృష్టి సారించాలి


చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ


మాచవరంలో సంపద తయారీపై అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ భీమారావు

మామిడికుదురు: ఇళ్ల నుంచి చెత్త సేకరించడంపై దృష్టి సారించాలని డీఎల్‌పీఓ బొజ్జిరాజు సూచించారు. ఆయన ఆదివారం మామిడికుదురులో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కె రాజుతో కలసి చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు రోజులు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టామన్నారు. తడి చెత్తతో పాటు పొడి చెత్తను విడి విడిగా సేకరించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ ఈ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్ సారథ్యంలో మండలంలోని 18 గ్రామాల్లోనూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరించడంతో పాటు దీనిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అంబాజీపేట: గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఈఓపీఆర్డీ గిడ్ల భీమారావు అన్నారు. మాచవరంలో ఇంటింటికీ వెళ్లి పొడి, తడి చెత్త వేరుచేసి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని ఆదివారం అవగాహన కల్పించారు. తడి చెత్తను, పొడి చెత్తను వేరుగా వేసేందుకు గతంలో రెండు ప్లాస్టిక్ డబ్బాలను పంచాయతీ సిబ్బంది పంపిణీ చేశామన్నారు. చెత్త నుంచి సంపద తయారీ ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరడమే కాకుండా కొందరికి ఉపాధి దొరుకుతుందన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యం కాపాడవచ్చన్నారు. పంచాయతీ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితోనే అనారోగ్య సమస్యలు


అంబాజీపేటలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న లలిత

అంబాజీపేట: నేటి సమాజంలో తీవ్రమైన మానసిక ఒత్తిడితో ప్రజలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని విశాఖపట్నంకు చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు, సాయి సంకల్ప ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎ.లలిత అన్నారు. అంబాజీపేట పెద్దవీధిలో ఉన్న డాక్టర్ ఢిల్లీబాబు ఆసుపత్రి వద్ద సత్యసాయి సేవా సంస్థల అంబాజీపేట సబ్ జోన్ ఆధ్వర్యంలో మెదడు, నరాల వ్యాధులపై ఉచిత వైద్య సేవా శిబిరం ఆదివారం జరిగింది. లలిత మాట్లాడుతూ కరోనా అనంతరం ఎక్కువ మంది ప్రజలకు నెగటివ్ ఆలోచనలు ఎక్కువయ్యాయని, దీనివల్ల ఆత్మవిశ్వాసం కోల్పోయి పలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని, ఎక్కువగా బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నారన్నారు. సకాలంలో తగిన వైద్య సేవలు అందిస్తే బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధిని అధిగమించవచ్చన్నారు. పార్కిన్‌సన్ వ్యాధితో బాధపడుతున్న రోగులకు పూర్తిగా వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో 155 మంది రోగులను పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్యంగా వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న పదిమంది రోగులకు ఖరీదైన మందులను సుమారు 6 నెలల పాటు ఉచితంగా అందించనున్నట్లు డా.లలిత చెప్పారు. శిబిరంలో అరవింద స్వామి, మణి కుమార్, సత్యసాయి జోన్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమల బెడద


అంబాజీపేటలో పేరుకుపోయిన చెత్తా చెదారం

అంబాజీపేట: వాతావరణం మార్పో.. ఏమో గాని గ్రామాల్లో దోమల బెడద ఎక్కువైంది. సాయంత్రం నాలుగు గంటలు దాటితే బయటకొచ్చి ప్రజలపై దాడి చేస్తున్నాయి. సాధారణంగా వర్షపునీరు నిల్వ ఉండిపోయి, భూమిలో తేమ కారణంగా ఎక్కడికక్కడ దోమలు ఉత్పత్తి చెందేవి. మిగిలిన కాలాల్లో మురుగు కాలువలు, డ్రైయిన్ ప్రాంతాల్లో దోమల సమస్య ఉండేది. అయితే కొన్ని రోజులుగా అన్ని ప్రాంతాల్లోనూ దోమల సమస్య ఎక్కువైందని గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దోమల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దోమల ద్వారా మలేరియా, బోద, డెంగీ, చికున్‌గున్యా, మలేరియా తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఏర్పడింది. గ్రామాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా మురుగు నిలిచిపోయి, లార్వా వృద్ధి చెంది దోమలు పెరుగుతున్నాయి. గ్రామ పంచాయతీలో దోమల నివారణ మందు స్ప్రే చేయకపోవడం వల్ల దోమలు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లో దోమల నివారణకు గతేడాది పంచాయతీలకు ఫాగింగ్ మెషీన్లు సరఫరా చేశారు. కాని వాటిని ఉపయోగిస్తున్నట్లు ఎక్కడా కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. దోమ కుడితే చర్మం విపరీతమైన మంట పుడుతుంది. కుట్టిన చోట చర్మం మంట పుట్టి, దద్దుర్లు వస్తున్నాయని ప్రజలు వాపోయారు. దోమల నివారణకు రూ.100 వెచ్చించి మస్కిటో కాయిల్స్ వెలిగిస్తున్నా, లిక్విడ్ మెషీన్లు పెడుతున్నా దోమలు లొంగడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దోమల నియంత్రణ ఎబేట్ మందును స్ప్రే చేయించాలని కోరుతున్నారు.

వైభవంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామంలో వీరభద్రస్వామి సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పులు, నృత్యాల నడుమ వైనతేయ గోదావరి నది వరకు స్వామి వారిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం నది వద్ద తులా ఆదినారాయణ, వెంకటలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో వీరభద్రస్వామి సంబరాన్ని ఘనంగా జరిపించారు. విఘ్నేశ్వర పూజ, శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు వీరభద్రస్వామికి శూలాలతో వీరనాట్యం చేస్తూ పరవశించిపోయారు. భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.


అప్పనపల్లిలో నిర్వహిస్తున్న వీరభద్రస్వామి సంబరం

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: వీరన్నబాబు బోనాల సంబరాన్ని ఆదివారం పి.గన్నవరంలో చెవ్వాకుల వీరవెంకట సత్యనారాయణ (శ్రీను) సరస్వతి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. జంగమదేవర వీరకుమారులతో బాణసంచా కాలుస్తూ మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గరుడేశ్వర స్వామి వారి ఆలయంలో జమ్మిచెట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం శ్రీను నివాసంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేదం లక్ష్యం భగవంతుని చేరుకోవడమే..

అయినవిల్లి: వేదం లక్ష్యం ప్రతి ప్రాణి భగవంతుడ్ని తెలుసుకోవడం కోసం, ఆయన్నూ చేరుకోవడం కోసమేనని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ భగవద్గీత పఠనం వల్ల భక్తుల తలరాత మారుతోందని, భక్తుల మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. వేద శాస్త్రాలను మనం నిత్యం పఠించాలన్నారు. వేదాల్లో సమస్తం ఇమిడి ఉందన్నారు. వేదం ఎక్కడ అయితే పఠిస్తారో అక్కడే భగవంతుడు కొలువై ఉంటాడన్నారు. అనంతరం భక్తులకు స్వామివారి స్వామి అన్నప్రసాదం పంపిణీ చేశారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

రావులపాలెం: పోలియో కారణంగా ఏర్పడిన అంగ వైకల్యంతో బాధపడుతున్న బాధితురాలి జీవనోపాధి నిమిత్తం రూ.10,500 ఆర్థిక సాయాన్ని స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం అందజేశారు. కొత్తపేట మండలం ఏనుగుల మహల్‌కి చెందిన మానే దుర్గకి (37) పుట్టుకతో పోలియో. రెండు కాళ్లు, ఒక చేయి పని చేయవు. కొంతకాలం క్రితం తండ్రి మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి వ్యవసాయ కూలీ పనులకి వెళ్లి కుటుంబాన్ని పోషిస్తుంది. తల్లికి భారం కాకుండా ఇంటి దగ్గర ఒక కిళ్లీ కొట్టు పెట్టుకుని జీవనం సాగించడానికి దుర్గ కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరింది. దీంతో సేవా సంస్థ సభ్యులు ఏనుగులమహల్ వెళ్లి రూ.10,500 చెక్కును సాయంగా అందజేశారు.


బాధితురాలికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

వైభవంగా విక్రమ భట్టీశ్వరుని కల్యాణం

ఆలమూరు: దక్షిణ భారతదేశంలో ప్రఖ్యాతి గాంచిన పార్వతీ సమేత విక్రమ భట్టీశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. స్థానిక ఆలయ ఆవరణలోని మండపంలో దేవతామూర్తుల విగ్రహాలను నెలకొల్పి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ పురోహితుల బృందం శైవాగమ పద్ధతిలో ఈ కల్యాణాన్ని నిర్వహించింది. ఉత్సవమూర్తుల విగ్రహాలను ఉంచి నిర్వహించిన గ్రామోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కల్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఆలమూరులో వేంచేసిన విక్రమ భట్టీశ్వరస్వామి

ముగిసిన నైపుణ్యాభివృద్ధి సదస్సు

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు 'హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ యూజింగ్ ఏఐ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం' పై జరిగిన అవగాహన సదస్సు ఆదివారంతో ముగిసింది. సదస్సులో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణ సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీసీ రామారావు, సీ డ్యాక్ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ వీసీవీ రావు పాల్గొన్నారు. హెచ్‌పీసీ నిపుణులు ఆన్‌లైన్‌లో అధ్యాపకులు, పీజీ విద్యార్థులకు హెచ్‌పీసీ అడ్వాన్స్‌డ్ కాన్సెప్ట్ గురించి వివరించారు. ప్రముఖ విద్యావేత్తలు, ఐటీ నిపుణులు, విదేశీ ఐటీ నిపుణులు సభ్యులకు అవగాహన కల్పించారు. దేశంలోని వివిధ యూనివర్సిటీ అధ్యాపకులు, ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా వారి వ్యక్తిగత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్ కోఆర్డినేటర్‌గా, డాక్టర్ అనురాగ్ కో కోఆర్డినేటర్ గా వ్యవహరించారు. అధ్యాపకులు విజయ కుమారి, అడబాల కుమార్, శివరామ కృష్ణ, సుష్మ, శాంతి, జీటీ నాయుడు, తిలక్, డాక్టర్ టీవీ జనార్దనరావు, వివిధ విభాగాధిపతులు, ఏవో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


సదస్సు బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కనకయ్య తదితరులు

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు


పూజలు అందుకుంటున్న వేంకటేశ్వర స్వామి

కొత్తపేట: మాఘమాసం ఆదివారం సందర్భంగా గోవింద మాల దీక్షాధారులతో సూర్య నమస్కారాలు, నవగ్రహాల అభిషేకం, పార్వేటి మహోత్సవం, సత్యనారాయణ స్వామి వ్రతం, శ్రీవారికి అభిషేకం, తిరుప్పావడ సేవ దేవస్థానం పండితులతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వాడపల్లి కదలివనంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం సంకీర్తనాచారి కరుటూరి వెంకట శ్రీనివాసరావుతో అన్నమయ్య స్వరార్చన, నవగ్రహాల సంకీర్తనామృతం గానం జరిగింది. కార్యక్రమానికి భక్తులు, యువ కులు, మహిళలు, ఉత్సాహంగా పాల్గొని స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సత్తెమ్మ అమ్మవారి సంబరం


సత్తెమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సంఘ పెద్దలు

రావులపాలెం: గొలుగూరి వారి సత్తెమ్మ అమ్మవారి సంబరాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి గరగలను గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో గరగ నృత్యాలు, కోలాటం, బాణసంచా కాల్పులు, విచిత్ర వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇంటి ముందుకు వచ్చిన సత్తెమ్మ అమ్మవారి గరగలకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సంబరాన్ని గొలుగూరి పెద్దలు గొలుగూరి సత్యనారాయణరెడ్డి, గొలుగూరి మునిరెడ్డి, గొలుగూరి వెంకటరెడ్డి (విక్టరీ), గొలుగూరి వెంకట రత్నారెడ్డి, గొలుగూరి వెంకటరెడ్డి (మారుతి) తదితరులు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న 'మహాభారత యుద్ధం'


మహాభారత యుద్ధం సన్నివేశంలో దుర్యోధనుడి పాత్రలో న్యాయవాది రమేష్


రాజోలు: వీరభద్రస్వామి, అయ్యప్ప స్వామి వారి ఆలయం వద్ద శివరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. గణపతి హోమంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన కార్తికేయ నృత్య ప్రదర్శన, భరతనాట్యం ప్రదర్శన చేశారు. అలాగే న్యాయవాది యాలంగి రమేష్ ప్రదర్శించిన ×మహా భారత యుద్ధం× సన్నివేశంలో దుర్యోధనుడి పాత్ర భక్తులను ఆకట్టుకుంది.

అనంతరం బాలనాగమ్మలోని మాయల ఫకీర్ ఏకపాత్రాభినయంతో అలరించారు. సాంఘిక, పౌరాణిక నాటకాలు ప్రదర్శించే నటులతో పాటు వాటిని వీక్షించే వారు కూడా తగ్గిపోతున్నారని, అందుకే స్టేజీపై ప్రదర్శనలు చేసి నాటి కళలను భావి తరాలకు చూపిస్తున్నాని న్యాయవాది రమేష్ వివరించారు. దుర్యోధన, మాయల ఫకీర్ పాత్రలు ప్రదర్శించిన రమేష్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఆలమూరు: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీ కుమార్ ఓటర్లను కోరారు. ఆలమూరులో ఆదివారం వారిద్దరూ పట్టభద్రుల ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థి పేరాబత్తులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి అభ్యర్థించారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలికి తీసుకు వెళ్లి పరిష్కరించే బాధ్యతను తీసుకుంటారని హామీ ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, పాలూరి సత్యానందం, వంటిపల్లి సతీష్, సత్తిబాబు, నల్లబాబు, రామాంజుల శేషగిరిరావు, ఈదల రాంబాబు, అనుసూరి నాగరత్నం పాల్గొన్నారు.

రక్తపింజర హతం



అల్లవరం: కొమర గిరిపట్నం శివారు నూకాలమ్మ సెంటర్ బస్టాండ్ వద్ద రక్త పింజర పాము హల్ చల్ చేసింది. మోసుగంటి సింహాద్రి ఇంటి ఆవరణలో పని చేస్తుండగా ఇటుకల మధ్య రక్త పింజర పామును గుర్తించారు. గ్రామస్తుల సాయంతో పామును హతమార్చారు. పాము సుమారు ఐదడుగుల పొడవు ఉందని సింహాద్రి తెలిపారు.

క్రిస్టియన్ మైనార్టీ విభాగం సమావేశం


క్రిస్టియన్ విభాగం అధ్యక్షులను సన్మానించిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ విభాగం సమావేశం సఖినేటిపల్లి ఆదివారం సఖినేటిపల్లిలో జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా రాజోలు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పాల్గొన్నారు. నూతనంగా నియమితులైన జిల్లా క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షురాలు ఈద సంధ్య, రాజోలు నియోజకవర్గం, క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఇంజెటి రవిలను సమావేశంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాట్రు కిమ్‌నాథన్, ఈద శ్రావణ్‌కుమార్, పాలపర్తి శేఖర్‌బాబు, కాట్రు నాని, కుసుమ ప్రభాకర్, కుసుమ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలపై పోరాటం


ఈదరాడలో విష్ణుమూర్తిని సత్కరిస్తున్న ఎంపీపీ వనజకుమారి

మామిడికుదురు: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఎంపీపీ కుసుమ వనజ కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన ఉచ్చుల విష్ణుమూర్తిని ఆదివారం ఈదరాడలో జరిగిన సమావేశంలో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ వనజ కుమారి మాట్లాడుతూ కొత్తగా పదవులు చేపట్టిన వారు పార్టీ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. పార్టీ నేతలు కుసు శ్రీధర్, ముసూడి నరసింహస్వామి, తోట త్రిమూర్తులు, గోసంగి చినబాపూజీ, కుసుమ పెరుమాళ్లకుమార్, యన్నాబత్తుల చిన్న, గుబ్బల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో సుదర్శనహోమం

అయినవిల్లి: అయినవిల్లిలో కొలువైన సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు లక్ష్మణచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు ఈ పూజ నిర్వహించారు. స్వామికి విశేష పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకులు వాసర్ల వీవీ సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో ఈ పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా పాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మామిడికుదురు: లూటుకుర్రులో పునర్నిర్మించిన ఆలయంలో పాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతిష్ఠా మహోత్సవాన్ని వేద పండితులు ఘనంగా జరిపించారు. బ్రహ్మశ్రీ బాదంపూడి సోమేశ్వరశర్మ బ్రహ్మత్వంలో పూజ్యం జగన్నాథశర్మ, విశ్వనాథశర్మ, మానేపల్లి భాస్కరశర్మల ఆధ్వర్యంలో మాఘ బహుళ దశమి మూల నక్షత్ర యుక్త వృషభ లగ్నంలో ప్రతిష్ఠా మహోత్సవాన్ని కన్నుల పండువలా జరిపించారు. గోకవరపు గణాధిపతి, లక్ష్మీసరోజ, గోకవరపు పెరుమాళ్లస్వామి, శ్రీవిద్య దంపతులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య మార్జనలు, పీఠన్యాసం, నవరత్న స్థాపన తదితర కార్యక్రమాలను వేద మంత్రాలతో వైభవంగా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

రావులపాలెం: మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి వివిధ దైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ జీజీవీ రమణ ఆదివారం తెలిపారు. స్థానిక బస్టాండ్ నుంచి 24, 25 తేదీల్లో విజయవాడ– శ్రీశైలం, 26న మహాశివరాత్రి రోజున ద్రాక్షారామ, అంగర–కోటిపల్లి, సామర్లకోట, పిఠాపురం, శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. అలాగే భక్తులు కోరుకున్న శైవ క్షేత్రాలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతామన్నారు. మరిన్ని వివరాలకు బస్‌స్టేషన్ ఎంక్వైరీ 99592 25549, అసిస్టెంట్ మేనేజర్ 73829 11871, డిపో మేనేజర్ 99592 25537 నంబర్లకు సంప్రదించాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

అయినవిల్లి: విలస గ్రామంలో ఇటీవల చేతిలో బాంబు పేలి గాయాలపాలైన బొక్కా హేమంత్‌కి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.25 వేలు అ గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు కుప్పాల ఈశ్వరి చేతుల మీదుగా అందజేశారు. నాయకులు కుప్పాల రాంబాబు, పెండ్ర రమేష్, అక్కిశెట్టి దుర్గారావు, అమలకట్ల చక్రవర్తి తదితరులు ఉన్నారు.